సాక్షి
ఖమ్మం
సోమవారం । 27 । జనవరి । 2025



మధిర మార్కెట్‌కు పాలకవర్గం

మధిర మార్కెట్ చైర్మన్‌గా నర్సింహారావు సహా నూతన పాలకవర్గాన్ని నియమించగా, నేడో, రేపో ఉత్తర్వులు విడుదల కానున్నాయి. 8లో



యథేచ్ఛగా అమ్మకాలు

ఖమ్మంలో గణతంత్ర దినోత్సవం రోజున సైతం చికెన్, మటన్ అమ్మకాలు జరపగా వ్యాపారులకు అధికారులు జరిమానా విధించారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
32° / 17°

జిల్లాలో సోమవారం మధ్యాహ్నం ఉష్ణోగ్రత పెరిగే అవకాశముంది. సాయంత్రం తర్వాత మాత్రం చలిగాలుల ప్రభావం మొదలవుతుంది.

న్యూస్‌రీల్

వెబ్‌సైట్‌లో అడ్మిట్ కార్డులు

కూసుమంచి: పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో వచ్చే విద్యాసంవత్సరానికి 9, 11వ తరగతుల్లో ప్రవేశాలకు ఫిబ్రవరి 8వ తేదీన పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసులు తెలిపారు. ఇందుకోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల అడ్మిట్ కార్డు (హాల్‌టికెట్లు)లు వెబ్‌సైట్ పొందుపర్చినట్లు వెల్లడించారు. ఈ మేరకు విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ తెలిపారు.

మైనార్టీ అభ్యర్థులకు పోటీ పరీక్షల శిక్షణ

ఖమ్మంమయూరిసెంటర్: గ్రూప్ -1 ప్రిలిమ్స్, గ్రూప్-2, 3, 4తో పాటు కేంద్ర ప్రభుత్వ స్టాఫ్ సెలక్షన్ కమిషన్, ఆర్ఆర్‌బీ తదితర పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న మైనార్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి కె.సత్యనారాయణ తెలిపారు. నాలుగు నెలల బేసిక్ ఫౌండేషన్ శిక్షణ కోసం డిగ్రీ పూర్తి చేసిన మైనార్టీ అభ్యర్థులు అర్హులని వెల్లడించారు. దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డ్, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, డిగ్రీ మెమో, 2 ఫొటోలను కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో ఫిబ్రవరి 10లోగా సమర్పించాలని, వివరాలకు 97040 03002 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆన్‌లైన్‌లోనే స్కాలర్‌షిప్, బోధనా రుసుం దరఖాస్తులు

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎస్సీ విద్యార్థులకు ఉపకార వేతనాలు, బోధనారుసుం మంజూరులో కాగిత రహిత విధానం అమలు కానుందని ఎస్సీ డీడీ సత్యనారాయణ తెలిపారు. ఈమేరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు నమోదు చేయగా కళాశాల లాగిన్‌కు వెళ్లనుండడంతో పరిశీలించి డిజిటల్‌కీ ద్వారా ఆమోదించాలని సూచించారు. జిల్లాలోని ప్రతీ కళాశాల ప్రిన్సిపాల్ డిజిటల్ కీ కొనుగోలు చేసి ఈ-పాస్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఆపై విద్యార్థుల దరఖాస్తులు జిల్లా అధికారికి ఆన్‌లైన్‌లో పంపాలని పేర్కొన్నారు.

జిల్లా సీనియర్స్ కబడ్డీ జట్టు ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లాస్థాయి సీనియర్ పురుషుల కబడ్డీ జట్టును ఎంపిక చేశారు. ఈమేరకు ఖమ్మం పటేల్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన ఎంపిక పోటీలకు 55మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఇందులో ప్రతిభ చూపిన వారితో ఎంపిక చేసిన జట్టు ఫిబ్రవరి 4నుంచి ఆదిలాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.దయాకర్‌రెడ్డి, కె.క్రిస్టోఫర్‌బాబు తెలిపారు. ఈ జట్టుకు 28నుంచి కల్లూరు ఇండోర్ స్టేడియంలో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారిలో బి.అజార్, డి.రాజా, బి.రమేష్, ఎస్.యశ్వంత్, కె.శివ, నాగరాజు, పి.ప్రవీణ్, టి.నవీన్, ఎస్.అజయ్, బి.వినయ్, ఎ.అఖిల్, వై.నరేష్, కె.వినోద్, జి.నాగరాజు, జి.రాజేష్, బి.కౌశిక్, బి.గోపి, బి.శ్రీనివాస్ ఉన్నారు.

మున్సిపాలిటీల్లో ప్రత్యేకాధికారుల పాలన

- అదనపు కలెక్టర్‌కు మూడింటి బాధ్యత

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీల్లో పాలకవర్గాల పదవీకాలం ఆదివారంతో ముగిసింది. దీంతో మున్సిపాలిటీలకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. ఇందులో భాగంగా జిల్లాలోని మధిర, సత్తుపల్లి, వైరా మున్సిపాలిటీల ప్రత్యేక అధికారిగా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) డాక్టర్ పి.శ్రీజకు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. సోమవారం నుంచి ఎన్నికలు జరిగి పాలకవర్గాలు బాధ్యతలు స్వీకరించే వరకు ప్రత్యేక అధికారి నేతృత్వాన మున్సిపాలిటీల్లో పాలన కొనసాగనుంది.

సంక్షేమం.. అభివృద్ధే లక్ష్యం

ఖమ్మం సహకారనగర్: జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూనే ప్రజల సంక్షేమానికి పాటుపడుతున్నామని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ వెల్లడించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా పోలీసు పరేడ్ మైదానంలో ఆయన ఆదివారం జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం పోలీసు సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించాక కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, నూతన రేషన్ కార్డుల జారీని గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. అర్హులైన చివరి లబ్ధిదారుడి వరకు పథకాల మంజూరు ఉంటుందని, ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించారు. ఈసందర్భంగా కలెక్టర్ ప్రసంగం ఆయన మాటల్లోనే...

జాతీయ పతాకాన్ని ఎగురవేసి వందనం చేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అధికారులు



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సీపీ సునీల్‌దత్



నృత్యం చేస్తున్న దానవాయిగూడెం గురుకుల కాలేజీ విద్యార్థిని

- జిల్లాలో సాఫీగా ఉచిత విద్యుత్, మహిళల బస్సు ప్రయాణం
- ఉగాది నాటికి మంచుకొండ ఎత్తిపోతలు పూర్తి
- రూ.690 కోట్లతో మున్నేటికి ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మాణం
- గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

రైతులకు రూ.122కోట్ల బోనస్

జిల్లాలో 1,31,723 మంది రైతులకు రూ.908.76 కోట్ల మేర రుణ మాఫీ జరిగింది. అలాగే, 42,461 మంది రైతుల నుంచి 24.41 లక్షల క్వింటాళ్లకు పైగా సన్నరకం ధాన్యం కొనుగోలు చేసి రూ.122 కోట్ల బోనస్ చెల్లించాం. ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న 3,57,181 కుటుంబాలను సర్వే చేసి తొలి దఫా అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 చొప్పున ఐదు నియోజకవర్గాలకు 17,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం. అర్హులైన వారందరికి రేషన్ కార్డుల ప్రొసీడింగ్ కాపీలు కూడా ఇస్తున్నాం.

2కోట్ల మంది మహిళల ప్రయాణం

మహిళలను మహాలక్ష్మిగా గౌరవించే సంస్కృతిలో భాగంగా ఆర్టీసీలో ఉచిత ప్రయాణం అమలవుతోంది. రోజుకు 69వేల మందికి పైగా జనవరి 20వ తేదీ వరకు జిల్లాలో 2.80కోట్ల మంది మహిళలు వినియోగించుకున్నారు. అలాగే, 2,40,504 మందికి గ్యాస్ సబ్సిడీ ద్వారా రూ.21.31 కోట్లు జమ అయ్యాయి. గృహజ్యోతి ద్వారా జిల్లాలో ఇప్పటి వరకు 2,57,995 కుటుంబాలకు నెలనెలా రూ.10కోట్ల విలువైన ఉచిత విద్యుత్ అందుతోంది. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి పెంచాక గత డిసెంబర్ వరకు 22,856మందికి రూ.51కోట్లకు పైగా విలువైన వైద్యసేవలు అందాయి. కాగా, జిల్లాకు గోదావరి జలాలు చేర్చాలనే ఉద్దేశంతో సీతారామ ఎత్తిపోతల పథకం నిర్మిస్తుండగా అందులో పాలేరు కాలువ పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే 15వ ప్యాకేజీ పూర్తికాగా, 14, 16 ప్యాకేజీల్లో పనులు పురోగతిలో ఉన్నాయి.

2,400 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ

రఘునాథపాలెం మండలంలోని పలు గ్రామాల్లో 2,400 ఎకరాల ఆయకట్టును స్థిరీకరించేలా రూ.66.33కోట్ల వ్యయంతో మంచుకొండ ఎత్తిపోతల పథకం పనులు జరుగుతున్నాయి. ఈ పనులను ఉగాది నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. ఇదికాక మధిర నియోజకవర్గంలో 6,079ఎకరాలు నూతన ఆయకట్టు, 33వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ కోసం కొదుమూరు, వందనం, రాయపట్నం, జవహర్ లిఫ్ట్ నిర్మాణాలకు రూ.685కోట్లతో ప్రణాళిక రూపొందించాం. అంతేకాక మున్నేటికి ఇరువైపులా రూ.690 కోట్ల వ్యయంతో రిటైనింగ్ వాల్స్ నిర్మాణం జరుగుతోంది.

మహిళలకు చేయూత

మహిళా సంఘాల్లో సభ్యులు ఆర్థికాభివృద్ధి సాధించాలనే సంకల్పంతో ప్రత్యేక దృష్టి సారించాం. ఇందిరా మహిళా శక్తిలో భాగంగా 20 స్త్రీ టీ స్టాళ్లు, నాలుగు మిల్క్ పార్లర్లు, 56 పాడి పశువుల యూనిట్లు, ఒక అమ్మ క్యాంటీన్ ఏర్పాటు చేయించాం. మధిర నియోజకవర్గంలో ఇందిరా మహిళా డెయిరీ ప్రారంభం కానుంది. అలాగే, జిల్లాలోని 34 పాఠశాలల్లో స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ ఇస్తుండగా 51 పాఠశాలల్లో న్యూట్రీ గార్డెన్లు ఏర్పాటుచేయించాం. ధరణి పోర్టల్‌లోని అన్ని మాడ్యూళ్లలో 70వేల పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాం. పర్యాటకాభివృద్ధిలో భాగంగా ఖమ్మం ఖిల్లాకు రూ.29 కోట్లతో రోప్‌వే, రూ.16కోట్లతో పాలేరు పార్క్ సుందరీకరణ, రూ.5.82 కోట్లతో నేలకొండపల్లి బౌద్ధ స్తూపం వద్ద పనులు చేపట్టనున్నాం. ఈ సమావేశంలో పోలీసు కమిషనర్ సునీల్‌దత్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అసిస్టెంట్ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ, డీఎఫ్‌ఓ సిద్ధార్థ విక్రమ్ సింగ్, అదనపు డీసీపీలు నరేష్‌కుమార్, ప్రసాద్‌రావు పాల్గొన్నారు. కాగా, క్యాంపు కార్యాలయంలోనూ కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.

వచ్చే ప్రతీపైసా పేదలకే పంచుతాం



చిన్నగోపతిలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి, పక్కన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్, వైరా ఎమ్మెల్యే రాందాస్ తదితరులు

- అర్హత ఉన్న వారందరికీ ఇల్లు వచ్చే వరకు పథకం
- బీఆర్‌ఎస్ నాయకులది దోపిడీ.. మాది సంక్షేమం
- నాలుగు పథకాల ప్రారంభోత్సవంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

కొణిజర్ల: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజాసంపదను దోపిడీ చేయడమే కాక మాయమాటలతో కాలం గడిపిందని, తాము మాత్రం సంపదను సృష్టించి ఆ ధనాన్ని ప్రజలకే పంచుతున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ఇందులో భాగంగానే సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నామని తెలిపారు. కొణిజర్ల మండలం చిన్నగోపతిలో ఆదివారం నాలుగు పథకాల ప్రారంభ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. తొలుత భట్టికి స్థానికులు ఘనస్వాగతం పలకగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశాక డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75ఏళ్లు పూర్తయిన సందర్భంగా తమ ప్రభుత్వం నాలుగు పథకాల అమలును ప్రారంభించిందని తెలిపారు. ఈ పథకాలతో ఏటా ఖజానాపై రూ.45 వేల కోట్లు అదనపు భారం పడనున్నా వెనుకాడడం లేదని చెప్పారు. రాష్ట్రంలో ఇల్లు లేని చివరి నిరుపేద వరకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కొనసాగుతుందన్నారు. ఇటీవల నిర్వహించిన గ్రామసభల్లో లక్షలాది దరఖాస్తులు రావడంతో పరిశీలనకు సమయం పట్టనున్నందున లాంఛనంగా కొన్ని గ్రామాల్లో పథకాల అమలును ప్రారంభించామని భట్టి తెలిపారు. మంజూరు పత్రాలు అందుకున్న రైతు కూలీలు, రైతుల ఖాతాల్లో సోమవారం ఆత్మీయ భరోసా, రైతుభరోసా నగదు జమ అవుతుందని చెప్పారు. గ్రామసభల ఉద్దేశం తెలియక వివిధ పార్టీల నాయకులు ప్రజల్లో అపోహలు సృష్టించేందుకు యత్నించారని, అలాంటివారిని నమ్మొద్దని సూచించారు. అనంతరం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడగా వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్, సీపీ సునీల్‌దత్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ట్రాన్స్‌కో ఎస్‌ఈ సురేందర్, ఆర్‌డీఓ నరసింహారావు, డీఎల్‌పీఓ రాంబాబు, వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ బొర్రా రాజశేఖర్, ఆత్మ చైర్మన్ కోసూరి శ్రీనివాసరావు, ఎంపీడీఓ రోజారాణి, ఎంపీఓ రాజేశ్వరి, తహసీల్దార్ రాముతో పాటు పోట్ల నాగేశ్వరరావు, గోసు మధు, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, దొబ్బల సౌజన్య, వడ్డె నారాయణరావు, జిల్లా మహేష్, పొట్లపల్లి శ్రీనివాసరావు, సూరంపల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

అందరికీ తోడుగా ఇందిరమ్మ రాజ్యం

రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

ముదిగొండ: అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందేవరకు ఇందిరమ్మ రాజ్యం, ప్రజాపాలన తోడుగా నిలుస్తుందని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు. ముదిగొండ మండలం ఖానాపురంలో జాలాది లక్ష్మికి రేషన్‌కార్డు, కొత్తపల్లి రాణికి ఇందిరమ్మ ఇల్లు, రైతు నర్సింహారావుకు రైతు భరోసాతో పాటు మరో మహిళకు ఆత్మీయ భరోసా పథకం మంజూరు పత్రాలను మంత్రి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అందించేలా అహర్నిశలు కృషి చేసిన అధికారులు అభినందనీయులన్నారు. ఖానాపురం వంటి చిన్న గ్రామంలో 107మందికి ఇళ్లు లేవంటే బాధ వేస్తోందని.. పదేళ్ల పాలనలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అర్హులకు ఇళ్లు ఇస్తే ఈ పరిస్థితి ఉండేది కాదన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో చేసిన అప్పులను తీరుస్తూ సంక్షేమ పథకాలు అమలుచేస్తున్న తమపై ప్రతిపక్షాలు దుమ్మెత్తి పోస్తున్నాయని మండిపడ్డారు. అయితే, వారి నోర్లు మూయించేందుకు అక్కాచెల్లెళ్లు తమకు అండగా నిలుస్తారనే నమ్మకముందని చెప్పారు. సంక్షేమ పథకాలకు ఇంకా అర్హులు ఉన్నా దరఖాస్తు చేసుకోవాలని, ఇది నిరంతరం కొనసాగుతుందని మంత్రి తెలిపారు. ఖానాపురంలో రైతు భరోసాకు 114మంది, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు 35మంది, రేషన్‌కార్డులకు 32మంది, ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు 107మందిని అధికారులు గుర్తించారని చెప్పారు. కాగా, ఉగాది నుంచి రేషన్ కార్డుపై పేర్లు ఉన్న ప్రతీ ఒక్కరికి ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం అందిస్తామని మంత్రి తెలిపారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీపీఓ ఆశాలత, మండల ప్రత్యేకాధికారి విజయలక్ష్మి, ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, ఎంపీఓ వాల్మీకి కిషోర్, ఏఓ వేణు, కాంగ్రెస్ జిల్లా, మండల అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కొమ్మినేని రమేష్‌బాబుతో పాటు మందరపు నాగేశ్వరరావు, పసుపులేటి దుర్గ, పసులేటి దేవేంద్రం, మాలోజి ఉష పాల్గొన్నారు.



రైతు నర్సింహారావుకు రైతుభరోసా మంజూరు పత్రం అందజేస్తున్న మంత్రి కోమటిరెడ్డి, అదనపు కలెక్టర్ శ్రీజ

ఉన్నోళ్లకు ఇవ్వొద్దు... లేనోళ్లకు ఆపొద్దు

రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రఘునాథపాలెం: కాంగ్రెస్ ప్రభుత్వంలో నిజమైన పేదలకే న్యాయం జరగాలన్నది తమ ధ్యేయమని.. ఈ విషయాన్ని గుర్తించి నాలుగు సంక్షేమ పథకాలు అర్హులకే అందేలా అధికారులు, ఇందిరమ్మ కమిటీలు పర్యవేక్షించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. రఘునాథపాలెం మండలం మల్లేపల్లిలో నాలుగు పథకాల మంజూరు పత్రాలను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో కలిసి మంత్రి పంపిణీ చేసి మాట్లాడారు. ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా ఏర్పడిన ఇందిరమ్మ రాజ్యంలో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తూ పాలన సాగిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం సాగు చేసే ప్రతీ రైతుకు రైతు భరోసా, భూమిలేని వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్ కార్డుల జారీకి శ్రీకారం చుట్టామని తెలిపారు. రఘునాథపాలెం మండలానికి సాగునీరు అందించేలా నిర్మిస్తున్న మంచుకొండ ఎత్తిపోతల పథకం పనులు ఉగాది నాటికి పూర్తి చేస్తామని వెల్లడించారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్, అదనపు కలెక్టర్ శ్రీజ, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, మార్కెట్, సొసైటీ చైర్మన్లు హన్మంతరావు, తాతా రఘురాం, డిప్యూటీ సీఈఓ నాగపద్మజ, ఆర్‌డీఓ జి.నర్సింహారావు, డీఆర్‌డీఓ సన్యాసయ్య, డీఏఓ పుల్లయ్య, ఏడీఏ కొంగర వెంకటేశ్వర్లు, ఏఓ ఉమామహేశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ అశోక్, తహసీల్దార్ లూథర్ విల్సన్, ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డితో పాటు బాలసాని లక్ష్మీనారాయణ, మానుకొండ రాధాకిషోర్, బండి వెంకన్న, దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, కొంటెముక్కల నాగేశ్వరరావు, ధరావత్ రామ్మూర్తి, మూడ్ చిన్నా తదితరులు పాల్గొన్నారు. కాగా, మంచుకొండ ఎత్తిపోతల పథకం పనులను గడ్డికుంట తండా వద్ద మంత్రి తుమ్మల పరిశీలించి సూచనలు చేశారు. జలవనరులశాఖ ఎస్‌ఈ ఎం.వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.



మంజూరు పత్రం అందజేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పక్కన కలెక్టర్, సీపీ తదితరులు

రాష్ట్రీయ రహదారులపైనా టోల్‌గేట్లు

- అత్యంత నాణ్యతతో నిర్మాణానికి నిర్ణయం
- ఆపై వ్యయం రాబట్టుకునేందుకు టోల్ వసూళ్లు
- జిల్లాలో తొలివిడతగా 300 కి.మీ. నిడివితో రోడ్ల ఎంపిక



అభివృద్ధి చేయనున్న ఖమ్మం - బోనకల్లు రోడ్డు

ఖమ్మం అర్బన్: జాతీయ రహదారుల తరహాలోనే రాష్ట్రీయ రహదారులను అత్యంత నాణ్యతతో నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా హైబ్రిడ్ యాన్యుటీ మోడల్(హెచ్‌ఏఎం)లో రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో సుమారు 4వేల కి.మీ. నిర్మాణానికి రోడ్లు, భవనాల శాఖ కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఈ విడతలో జిల్లాలో 300 కి.మీ. రహదారుల నిర్మాణానికి అధికారులు నిర్ణయించి నివేదిక రూపొందించారు. అయితే, రహదారుల నిర్మాణానికి అయ్యే వ్యయం రాబట్టుకునేందుకు టోల్‌గేట్లు ఏర్పాటు చేయనున్నారు.

పదేళ్లకు పైగా నిర్వహణ బాధ్యత

ప్రస్తుతం ఉన్న ప్రధాన రాష్ట్రీయ రహదారుల తరచుగా దెబ్బతింటున్నాయి. మళ్లీ కొత్తవి నిర్మించాలన్నా, మరమ్మతు చేయాలన్నా వ్యయం పెరుగుతుండడంతో ప్రభుత్వం నూతన విధానాన్ని రూపొందించినట్లు తెలిసింది. ఇందులో భాగంగానే అత్యాధునికంగా, నాణ్యతతో రహదారులు నిర్మించే బాధ్యత కాంట్రాక్టు ఏజెన్సీలకు అప్పగిస్తారు. రోడ్డు నిర్మాణం చేపట్టే కాంట్రాక్టు ఏజెన్సీ బాధ్యులు బ్యాంక్ రుణం ద్వారా పనులు చేపడుతారు. ఇందులో ప్రభుత్వం కూడా భాగస్వామిగా వ్యవహరిస్తుందని సమాచారం. అనంతరం నిర్మాణ వ్యయం రాబట్టుకునేలా ఆయా రోడ్లపై టోల్ గేట్లు ఏర్పాటుచేసి వాహనదారుల నుంచి నిర్ణీత రుసుము వసూలు చేయాలనే యోచనలో ఉన్నట్లు తెలిసింది. అంతేకాకుండా 10నుంచి 15ఏళ్ల పాటు రహదారి నిర్వహణ బాధ్యతలు సైతం ఏజెన్సీ చూడాల్సి ఉండగా. ఎక్కడైనా దెబ్బతిన్నా మరమ్మతులు చేయాల్సి ఉంటుందని సమాచారం. ఇందుకోసమే టోల్‌టాక్స్ విధానాన్ని అమలుచేయనున్నట్లు తెలుస్తోంది. కాగా, జిల్లాలో తొలి విడత 300 కి.మీ. మేర రాష్ట్రీయ లింక్ రహదారులను నిర్మిస్తారు. ఇందుకోసం ఖమ్మం - ఇల్లెందు రోడ్డు, ఖమ్మం - బోనకల్లు రోడ్డును ఎంపిక చేసినట్లు సమాచారం. వీటితో పాటు ఇతర జిల్లాల్లోనే ప్రయోగాత్మకంగా కొన్ని రహదారులను నిర్మించి టోల్‌గేట్లు ఏర్పాటుచేశాక ఈ విధానం విజయవంతమైతే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రధాన రహదాలను ప్రైవేట్ భాగస్వామ్యంతో అభివృద్ధి చేసే అవకాశం ఉంది. ఈ విధానంతో వాహనదారులపై భారం పడనున్నప్పటికీ ఏజెన్సీ బాధ్యుల పర్యవేక్షణతో రహదారులు కలకాలం మన్నికగా ఉంటాయని, ప్రయాణం సాఫీగా సాగుతుందని అధికారిక వర్గాలు చెబుతున్నాయి.

వైకుంఠ రాముడి 'విశ్వరూపం'

రామయ్యకు వైభవంగా మహాదర్బార్ సేవ



స్వామివారికి విశ్వరూప సేవ నిర్వహిస్తున్న అర్చకులు, వేద పండితులు

భద్రాచలం : ధూప, దీప నైవేద్యాల నడుమ.. చుట్టూ 108 మంది అర్చనా మూర్తులతో కొలువుదీరిన వైకుంఠ రాముడి విశ్వరూప సేవ కనువిందు చేసింది. జగాలను ఏలే జగదభి రాముడి మహా దర్బార్, గరుత్మంత వాహనంపై రాజాధిరాజుగా కనిపించిన రామయ్య దర్శనంతో భక్తులు పులకించిపోయారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో ఆదివారం ఈ వేడుకను అర్చకులు నిర్వహించారు. ముక్కోటి ఉత్సవాలు ముగిశాక వచ్చే బహుళ ద్వాదశి రోజు ఈ వేడుక నిర్వహించడం ఆనవాయితీ. ఏడాది పూజల్లో దొర్లే దోషాల నుంచి ప్రాయశ్చిత్తం కోసం శ్రీ సీతారామలక్ష్మణులతో పాటు ఆలయం ప్రాంగణం ఉపాలయాల్లోని 108 మంది అర్చనా మూర్తులను ఒకే చోట వేంచేపు చేసి ఏకకాలంలో సేవ నిర్వహించడం ఈ వేడుక విశిష్టత.



■ ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు


అసిస్టెంట్ కలెక్టర్ మ్రిణాల్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, పక్కన సీపీ సునీల్‌దత్

జిల్లాలోని వివిధ శాఖల్లో ప్రతిభ కనబరుస్తున్న ఉత్తమ ఉద్యోగులు, సిబ్బంది 269 మందిని ఎంపిక చేశారు. ఖమ్మం పరేడ్ మైదానంలో ఆదివారం నిర్వహించిన గణతంత్ర దినోత్సవంలో వారికి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. సీపీ సునీల్‌దత్, అదనపు కలెక్టర్ శ్రీజ, డీఎఫ్ఓ సిద్ధార్థ విక్రమ్‌సింగ్, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య పాల్గొన్నారు. కాగా, పరేడ్ మైదానంలో శాఖల వారీగా పథకాలు, ప్రగతిని వివరించేలా ఏర్పాటు చేసిన స్టాళ్లు ఆకట్టుకున్నాయి. విద్య, వైద్యం, వ్యవసాయం, గృహ నిర్మాణం, విద్యుత్, ఆర్టీసీ, కేఎంసీ, అటవీ, పౌర సరఫరాల శాఖల ఆధ్వర్యాన స్టాళ్లు ఏర్పాటుచేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా వివిధ పాఠశాలల విద్యార్థులు ఇచ్చిన ప్రదర్శనలను ఆహుతులు ఆసక్తిగా తిలకించారు. అనంతరం స్వాతంత్య్ర సమరయోధులను కలెక్టర్, సీపీ సునీల్‌దత్ సన్మానించారు.

– ఖమ్మంసహకారనగర్


స్వాతంత్య్ర సమరయోధులను సన్మానిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్


కళావతిబాయి, డీఎంహెచ్‌ఓ | ఎంఏ గౌస్, డీపీఆర్‌ఓ | జి.నాగేందర్ రెడ్డి, ఈఎస్ | డి.పుల్లయ్య, డీఏఓ | ఎ.శ్రీనివాస్, సీపీఓ | సాదియాసుల్తానా, కలెక్టరేట్ | దుర్గాప్రసాద్, ఈడీఎం | జి.లక్ష్మణ్‌రావు, రిటైర్డ్ తహసీల్దార్ | నర్సింహారావు, జమేదార్ | సీహెచ్.రమేశ్, గిర్దావర్, కొణిజర్ల | ఖాసీంఖాన్, ఎస్ఐ, ఖమ్మం | కె.నాగరాజు, ఏఎస్ఐ, ఖమ్మం | భానుప్రకాశ్, సీఐ, ఖమ్మం | సంజీవ్, సీఐ, కూసుమంచి | నాగరాజు, ఎస్ఐ, కూసుమంచి


జగదీశ్, ఎస్ఐ, తిరుమలాయపాలెం | పి.సంతోష్, ఎస్ఐ | డి.మధు, సీఐ | హానక్, సీఐ, సీఎస్‌బీ | వి.కిశోర్‌రెడ్డి, పీసీ, సీఎస్‌బీ | ఎస్.తిరుపతి, సీఐ, టాస్క్‌ఫోర్స్ | టి.రవికుమార్, ఎస్ఐ, ట్రాఫిక్ | కె.శ్రీనివాస రెడ్డి, సీపీఓ | డి.అక్కులు, ఏఆర్ ఎస్ఐ | ఎం.రాజేశ్వరి, డీఆర్‌ఓ | ఎం.రాధ, ఏఓ, నేలకొండపల్లి | చంద్రశేఖర్, ఏఓ | పి.రవీందర్, హెచ్‌డబ్ల్యూఓ | షఫీ ఉల్లా, అసిస్టెంట్ కమిషనర్ | ధరణికుమార్, డీఈఈ, కేఎంసీ


కె.శ్రీనివాస్, సూపరింటెండెంట్ | జి.సంతోష్, టీఏ, మైన్స్ | సీహెచ్.దీప్తి, సీహెచ్. | డాక్టర్ అల్తాఫ్, చింతకాని | శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ | సాంబశివారెడ్డి, డీఎంహెచ్‌ఓ ఆఫీస్ | రామచంద్ర రావు, ఎంపీఓ | కె.సాహితి, డీపీఓ ఆఫీస్ | వి.ఉపేంద్ర, ఈఓ | టి.మంగవతి, ఎస్సీ కార్పొరేషన్ | బి.నిర్మల, జేఈఓ, ఖమ్మం | శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ | ఎ.రామకృష్ణ శర్మ, అర్చకుడు | సుబ్బయ్య, లీడింగ్ ఫైర్‌మెన్ | టి.రాజేశ్, ఫైర్‌మెన్, మధిర


స్వామి, ఏఓ, సత్తుపల్లి | జి.కవిత, జూనియర్ అసిస్టెంట్ | ఎ.మదన్, ఎఫ్ఎస్ఓ | ఎస్.సృజన్, అటవీశాఖ | డాక్టర్ సి.సరిత, మెడికల్ కాలేజీ | డాక్టర్ రాంబాబు, ఆర్ఎంఓ, ఖమ్మం | పార్వతమ్మ, సూపరింటెండెంట్ | కె.సత్యం, డైట్ కళాశాల | గురునారాయణ, సెరికల్చర్ శాఖ | ఎస్.మంగ, డీపీఆర్ఓ ఆఫీస్ | పి.అజయ్, డీపీఆర్ఓ ఆఫీస్ | డి.రాజ్యలక్ష్మి, జీజేసీ, ఖమ్మం | టి.వెంకట్రామ, జలవనరుల శాఖ | సమ్ముద్దీన్, జలవనరుల శాఖ | దుర్గాప్రసాద్, జలవనరుల శాఖ


వెంకటేశ్వర్లు, ఎస్‌బీఐ బీఎం | జి.సుజాత, మెప్మా, ఖమ్మం | జి.మురళీధర్, ఏఈఈ, మధిర | సక్రునాయక్, జైలర్, ఖమ్మం | కె.రమేశ్‌బాబు, వార్డర్, ఖమ్మం | ఏ.రవికుమార్, ఎక్సైజ్ శాఖ | ఎం.సతీశ్, డిప్యూటీ పీడీ | నవీన్‌కుమార్, డీఈఈ, ఖమ్మం | షేక్ హుస్సేన్, ఏఈ, ఖమ్మం | మహ్మద్ ఖలీల్, జేఏ | బస్సుల ప్రదీప్, ఆర్ఐ, వైరా | జి.చంద్రశేఖర్, డీఈఈ, ఖమ్మం | కె.శ్రీకాంత్, ఏఈఈ, బోనకల్ | ఎన్.విజయ, హెచ్‌డబ్ల్యూఓ | పి.వెంకట్రావు, డిప్యూటీ ఐఓఎస్ | మోహన్‌మురళి, డెయిరీ డీడీ | ఎం.తిరుమతి, ఉర్దూ ఆఫీసర్ | నాగేశ్వరరావు, ఏఈ, ఖమ్మం | నాగేశ్వరరావు, ఆర్టీసీ | పీవీ పద్మావతి, ప్రిన్సిపాల్


అరుణకుమారి, ప్రిన్సిపాల్ | సీతామహాలక్ష్మి, ప్రిన్సిపాల్ | శ్రీనివాసరావు, ఎంఈఓ | కె.సంధ్యారాణి, సీనియర్ అకౌంటెంట్ | జహీరుద్దీన్, ఏటీడీఓ, వైరా | డాక్టర్ ఎం.రాకేశ్ కుమార్, వైరా | స్వరూప, జక్కేపల్లి | ఎం.స్వర్ణలత, పశుసంవర్ధక శాఖ | శ్రీదేవి, లీగల్ కౌన్సిలర్ | ఎ.కనకవల్లి, జిల్లా లైబ్రరీ | ఎస్.పుల్లయ్య, ఏఎస్ఐ | కె.వెంకటేశ్వర రావు, ఏఎస్ఐ | వేణుగోపాల్ రెడ్డి, ఎంపీడీఓ | వేణుగోపాల్‌రావు, సీనియర్ అసిస్టెంట్ | టి.లత, ఎక్సైజ్ ఎస్ఐ | మహేశ్వరరావు, కానిస్టేబుల్ | నర్సింహారావు, కానిస్టేబుల్ | జి.స్వర్ణలత, సీనియర్ అసిస్టెంట్ | పూర్ణప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ | కిరణ్‌కుమార్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్


బాబూరావు, సత్తుపల్లి | ఈ.అనురాధ, ఏఓ, డీఆర్‌డీఏ | అజయ్‌కుమార్, ఓఎస్‌డీ | జె.లక్ష్మణ్‌రావు, ఏపీఎం | డాక్టర్ అనిత, పెనుబల్లి | ఎస్.చైతన్య, స్టాఫ్‌నర్స్ | జి.కవిత, స్టాఫ్ నర్స్ | డాక్టర్ కిరణ్‌కుమార్, సూపరింటెండెంట్ | డాక్టర్ బి.కిరణ్ కుమార్, సర్జన్ | ఎం.రవికిశోర్, డీఎంహెచ్‌ఓ ఆఫీస్ | వెంకటేశ్వరరావు, రెవెన్యూ ఉద్యోగి | ఎస్.సందీప్, కేఎంసీ | ఎండీ మతిన్, క్రికెట్ కోచ్ | ఎం.సురేశ్, చేతన ఫౌండేషన్ | జే.శ్రీనివాసరావు, గ్రౌండ్స్‌మెన్ | పి.రాంప్రసాద్, తహసీల్దార్ | గోపాలకృష్ణ, 108 పైలట్


వేడుకలకు హాజరైన కలెక్టర్ తండ్రి, మాజీ పోలీస్ అధికారి ఏ.కే.ఖాన్ తదితరులు

క్లుప్తంగా

యథేచ్ఛగా చికెన్, మటన్ అమ్మకాలు

వ్యాపారులకు రూ.31 వేల జరిమానా


వ్యాపారికి జరిమానా రశీదు ఇస్తున్న కేఎంసీ ఉద్యోగులు

ఖమ్మంమయూరిసెంటర్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా మటన్, చికెన్ షాపులు మూసివేయాలని, అమ్మకాలు జరిపితే చర్యలు తీసుకుంటామని ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ముందుగానే హెచ్చరించారు. అయినా ఆదివారం కావడంతో వ్యాపారం కోల్పోవద్దని కొందరు వ్యాపారులు షాపులు తెరిచి బహిరంగంగానే అమ్మకాలు చేపట్టారు. దీంతో నగరవ్యాప్తంగా తనిఖీలు చేపట్టిన కేఎంసీ ఉద్యోగులు షాపులు తెరిచిన వ్యాపారులకు జరిమానా విధించారు. ఈ మేరకు పలువురికి రూ.31 వేల జరిమానా విధించినట్లు శానిటరీ సూపర్‌వైజర్ సాంబయ్య తెలిపారు. తనిఖీల్లో ఎస్ఐలు మల్లయ్య, వెంకటేశ్వర్లు, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు రంగులు, విద్యార్థినికి ల్యాప్‌టాప్


విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న ఫౌండేషన్ బాధ్యులు

కల్లూరు: తోపుడుబండి ఫౌండేషన్ నిర్వాహకురాలు ఉషాసాదిక్‌అలీ ఆధ్వర్యాన మండలంలోని ఖాన్‌ఖాన్ ప్రాథమిక పాఠశాల భవనానికి రూ.65 వేలతో రంగులు వేయించారు. ఆదివారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా అంబేడ్కర్‌నగర్‌కు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి మేకల సమాఖ్యకు రూ.65 వేల విలువైన ల్యాప్‌టాప్ అందజేశారు. కార్యక్రమంలో దయాల్ కిశోర్‌దత్, సుజాత, ఉపాధ్యాయులు నిర్మల, లక్ష్మీప్రసన్నతో పాటు బంకా బాబు, సత్తెనపల్లి నర్సింహారావు, అన్నపూర్ణ, ఏసు, మౌర్య, మజ్హార్, అష్యా, జానీ పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థి వైజాగ్‌లో..

బోనకల్: మధిర మండలం కృష్ణాపురం గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న బోనకల్ మండలంలోని రాపల్లికి చెందిన చల్లా మహేశ్వరరావు ఈ నెల 22న ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. స్నేహితులు, బంధువుల ఇళ్లకు వెళ్లాడేమోనని తల్లిదండ్రులు గాలిస్తున్నారు. ఇంతలోనే విశాఖపట్నంలోని ఆర్కే బీచ్‌లో కనిపించిన ఉమామహేశ్వరరావును అక్కడి ఆటోడ్రైవర్లు ఆరాతీయగా వివరాలు చెప్పడంతో ఫోన్‌లో తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆదివారం వారు వైజాగ్ వెళ్లి విద్యార్థిని తీసుకొచ్చారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.20,506

చరిత్రలో నిలిచిపోయేరోజు ఇది..

ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి

సత్తుపల్లి/వేంసూరు/కల్లూరు రూరల్/పెనుబల్లి/తల్లాడ: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒకేరోజు నాలుగు పథకాల అమలును ప్రారంభిస్తుండటం ఆనందంగా ఉందని, ఈరోజు చరిత్రలో నిలిచిపోతుందని సత్తుపల్లి ఎమ్మెల్యే ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి తెలిపారు. సత్తుపల్లి మండలం కొత్తూరు, వేంసూరు మండలం చిన్నమల్లెల, కల్లూరు మండలం తూర్పులోకవరం, పెనుబల్లి మండలం రామచంద్రాపురం, తల్లాడ మండలం కొడవటిమెట్టలో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారులకు ఆదివారం ఆమె మంజూరు పత్రాలు అందజేశారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించి ఆరోగ్యశ్రీ పరిమితి పెంచామని గుర్తుచేశారు. ఆ తర్వాత గ్యాస్ సబ్సిడీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకంతో పాటు రైతు రుణమాఫీ, సన్న ధాన్యానికి బోనస్ చెల్లించగా ఇప్పుడు మరో నాలుగు పథకాలు అమల్లోకి వచ్చాయని తెలిపారు. కార్యక్రమాల్లో ఆర్డీఓ రాజేంద్రగౌడ్, తహసీల్దార్లు యోగేశ్వరరావు, పులి సాంబశివుడు, ప్రతాప్, వనజ, ఎంపీడీఓలు నాగేశ్వరరావు, చంద్రశేఖర్, అన్నపూర్ణ, చంద్రమౌళితో పాటు అధికారులు, నాయకులు డాక్టర్ మట్టా దయానంద్‌విజయ్‌కుమార్, శ్రీనివాసరెడ్డి, ఆనంద్‌బాబు, సునీల్‌రెడ్డి, చల్లగుళ్ల నర్సింహారావు, చలసాని సాంబశివరావు, గొర్ల రామ్మోహన్‌రెడ్డి, మేకా సతీశ్‌రెడ్డి, కొప్పుల నరేందర్‌రెడ్డి, శ్రీనివాసరావు, పుచ్చకాయల సోమిరెడ్డి, కాసరి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, సత్తుపల్లి జలగంనగర్‌లో సింగరేణి నిధులతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని సైతం ఎమ్మెల్యే రాగమయి ప్రారంభించడంతో పాటు జలగంనగర్‌లో బీటీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. కమిషనర్ ఎం.రవిబాబు, సీడీపీఓ కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.


సత్తుపల్లి : కొత్తూరులో పథకాల మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రాగమయి


వైరారూరల్: పుణ్యపురంలో లబ్ధిదారులకు పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే రాందాస్

ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు

వైరారూరల్: ఇందిరమ్మ రాజ్యంలో అర్హులైన ప్రతీఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తామని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ తెలిపారు. మండలంలోని పుణ్యపురంలో నాలుగు పథకాల లబ్ధిదారులకు ఆయన మంజూరు పత్రాలు అందజేసి మాట్లాడారు. ప్రత్యేకాధికారి కస్తాల సత్యనారాయణ, తహసీల్దార్ కేవీ.శ్రీనివాస్, ఎంపీడీఓ పి.సరస్వతితో పాటు బొర్రా రాజశేఖర్, శీలం వెంకటనర్సిరెడ్డి, వెంగళ కృష్ణ, మచ్చా బుజ్జి, దొడ్డా పుల్లయ్య, బీడీకే రత్నం, తదితరులు పాల్గొన్నారు.

మధిర మార్కెట్ పాలకవర్గం ఖరారు

ఛైర్మన్‌గా బండారు నర్సింహారావు


నర్సింహారావు, ఛైర్మన్


సత్యనారాయణరెడ్డి, వైస్‌ఛైర్మన్

మధిర: మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ఖరారైనట్లు తెలిసింది. ఎర్రుపాలెం మండలం మామునూరుకు చెందిన మాజీ సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బండారు నరసింహారావు ఛైర్మన్‌గా, మధిర మండలం వంగవీడుకు చెందిన అయిలూరి సత్యనారాయణరెడ్డి వైస్ ఛైర్మన్ పాలకవర్గాన్ని ఖరారు చేసినట్లు సమాచారం. అయితే, ఇందుకు సంబంధించి అధికారిక ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది. మధిర మార్కెట్ ఛైర్మన్ పదవి బీసీలకు రిజర్వ్ చేయగా తొలిసారి ఎర్రుపాలెం మండలానికి ఛైర్మన్ పదవి దక్కింది. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సిఫారసుతో ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ సహా డైరెక్టర్లను ఖరారు చేయగా నేడో, రేపో ఉత్తర్వులు వెలువడనున్నట్లు సమాచారం. నూతన కమిటీ జాబితా ఇప్పటికే అధికారులకు చేరగా పూర్తి వివరాలతో నివేదిక సమర్పించగానే ఉత్తర్వులు జారీ చేస్తారని సమాచారం.

తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన


ఖాళీ బిందెలతో నిరసనలో పాల్గొన్న మహిళలు

తల్లాడ: తల్లాడలోని ఒకటో వార్డుకు తాగునీరు అందక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యాన ఆదివారం బోరు వద్ద మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. గ్రామ పంచాయతీ ద్వారా వారం రోజులుగా తాగునీరు సరఫరా కాకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని, బోరు చెడిపోయినా మరమ్మతులు చేయించడం లేదని ఆరోపించారు. ఈ విషయమై ఈఓ కృష్ణారావుకు తెలిపినా పట్టించుకోవడం లేదని, ఇకనైనా స్పందించి తమ సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఈలప్రోలు నాగమణి, బొడ్డు జయ, సిరిగిరి నాగేశ్వరి, బీరెల్లి లక్ష్మి, అఖిల పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

ఖమ్మంఅర్బన్: ఖమ్మం టేకులపల్లిలో ఆదివారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో రేకుల ఇల్లు కాలిపోయింది. గ్రామంలోని ఆలయం వెనకాల రేకుల ఇంట్లో కొత్తపల్లి ఉపేందర్ నివాసముంటూ ఇస్త్రీ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమాన ఎవరూ లేని మంటలు మొదలై దుస్తులు, సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. ఈ విషయం తెలియడంతో కార్పొరేటర్ డి.సత్యనారాయణ, స్థానికులు నష్టంపై ఆరా తీశారు.

విద్యుత్ అధికారులకు ప్రతిభా పురస్కారాలు


ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎన్పీడీసీఎల్ డైరెక్టర్లు

ఖమ్మంవ్యవసాయం: ఉత్తమ సేవలకు గాను విద్యుత్ శాఖలో పలు డివిజన్లకు అవార్డులు ప్రకటించారు. ఈ సందర్భంగా గత ఏడాది మే నుంచి డిసెంబర్ వరకు గాను ఖమ్మంటౌన్-1 సబ్ డివిజన్, ఖమ్మంటౌన్-5 సెక్షన్లు ఎంపికయ్యాయి. దీంతో ఆయా విభాగాల ఏడీఈ నాగార్జున, ఏఈ తిరుపయ్య, సిబ్బందికి హనుమకొండలోని ఎన్పీడీసీఎల్ కార్యాలయంలో ఆదివారం గణతంత్ర దినోత్సవంలో ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు.

అవార్డు అందుకున్న కామేపల్లి వాసి


అవార్డు స్వీకరిస్తున్న రాందాస్

కామేపల్లి: ఢిల్లీలో ఆదివారం జరిగిన గణతంత్ర దినోత్సవంలో కామేపల్లి మండలానికి చెందిన అజ్మీరా రాందాస్‌నాయక్ పాల్గొన్నారు. పీఎం మత్స్య సంపద పథకం లబ్ధిదారుడైన ఆయనను పరేడ్‌కు ఆహ్వానించడంతో హాజరయ్యారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఖదీర్ అహ్మద్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

కొణిజర్ల: బోనకల్ బ్రాంచ్ కాల్వలో గుర్తు తెలియని మృతదేహం లభించిందని ఎస్ఐ జి.సూరజ్ తెలిపారు. బీబీసీ లాక్‌లకు కి.మీ. దూరాన గుర్తు తెలియని పురుషుడి మృతదేహం ఉందనే సమాచారంతో పరిశీలించారు. మృతుడు నల్ల రంగు టీషర్టు ధరించి ఉండగా, మృతదేహం గుర్తుపట్టలేని విధంగా కుళ్లిపోయిందని తెలిపారు. దీంతో అన్నం ఫౌండేషన్ వారి సహకారంతో మృతదేహాన్ని తీయించి ఖమ్మం ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు వెల్లడించారు.

టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి


వెంకన్న (ఫైల్)

ఖమ్మంరూరల్: మండలంలోని ఏదులాపురం క్రాస్ సమీపాన టీవీఎస్ మోపెడ్‌పై వెళ్తున్న వ్యక్తిని వెనుక నుంచి టిప్పర్ ఢీకొట్టడంతో మృతి చెందాడు. పెదతండా పరిధి ఇందిరమ్మకాలనీకి చెందిన పెంద్ర వెంకన్న (47) కూరగాయల వ్యాపారం చేస్తున్నాడు. ఆదివారం ఉదయం మోపెడ్‌పై బైపాస్ మీదుగా వరంగల్ క్రాస్ రోడ్‌కు వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన టిప్పర్ ఢీకొట్టడంతో వెంకన్న అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు సహకారంతో ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ ఎం.రాజు తెలిపారు.

సాగర్ కాల్వలో పడి వ్యక్తి...

కల్లూరు: కల్లూరు పట్టణానికి చెందిన ఇందూరి నాగాచారి (54) శనివారం బజారుకు వచ్చి కన్పించక పోవడంతో కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఐతే శనివారం విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో నాగార్జున సాగర్ కెనాల్‌కు వెళ్లిన నాగాచారి చెప్పులు, సైకిల్ కాలువ కట్ట మీద ఆదివారం స్థానికులు గుర్తించారు. కాలువలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందిన నాగాచారి మృతదేహం ఎర్రబోయినపల్లి కాలువ సమీపంలో తేలింది. పోలీసులు గుర్తించి మృతదేహాన్ని బయటకు తీసి పెనుబల్లి ప్రభుత్వాస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హక్కులతో పాటు బాధ్యతలను గుర్తించాలి..

గణతంత్ర దినోత్సవంలో జిల్లా జడ్జి రాజగోపాల్

ఖమ్మంలీగల్: ప్రతీ ఒక్కరు రాజ్యాంగం కల్పించిన హక్కులను వినియోగించుకుంటూనే బాధ్యతలను కూడా గుర్తించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ సూచించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కోర్టు ఆవరణలో ఆదివారం ఆయన మువ్వన్నెల జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. దేశ సమగ్రత, సార్వభౌమత్వాన్ని కాపాడడానికి యువత నడుం బిగించాలని తెలిపారు. న్యాయవాదులు మెరుగైన సమాజం ఏర్పాటులో తమవంతు పాత్ర పోషించాలని చెప్పారు. అనంతరం క్రీడాపోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. న్యాయమూర్తులు రాంప్రసాద్‌రావు, సీనయ్య, ఎం.కల్పన, వి.శివరంజని, కె.దీప, బి.రజిని, ఏపూరి బిందుప్రియ, బి.నాగలక్ష్మి, ఆర్.శాంతిలత, వి.మాధవి, బార్ కౌన్సిల్ సభ్యుడు కొల్లి సత్యనారాయణ, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నేరెళ్ల శ్రీనివాసరావు, సీహెచ్.వెంకట్, జిల్లా కోర్టు ఏఓ హరికృష్ణతో పాటు నాజర్, రాధేశ్యామ్, ఓంకార్, శ్రీనివాస్, రాజు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు

● ఖమ్మంసహకారనగర్: కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఉద్యోగులు సమష్టిగా పనిచేయాలని సూచించారు. డీఆర్వో ఎం.రాజేశ్వరి, కలెక్టరేట్ ఏఓ ఎన్.అరుణ తదితరులు పాల్గొన్నారు.


జాతీయ జెండా ఆవిష్కరించి మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

● ఖమ్మంవన్‌టౌన్: జిల్లా పరిషత్ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జెడ్పీ సీఈఓ దీక్షా రైనా జాతీయ జెండా ఆవిష్కరించగా డిప్యూటీ సీఈఓ విజయలక్ష్మితో పాటు ఇట్టే రామకృష్ణారెడ్డి, విజయలక్ష్మి, రమణశేఖర్, మధు తదితరులు పాల్గొన్నారు.

● ఖమ్మంక్రైం: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖమ్మం ప్రకాష్‌నగర్‌లోని కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అలాగే, రవాణా శాఖ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఆర్టీఓ వెంకటరమణ జాతీయ జెండాను ఆవిష్కరించగా ఏఓ జావిద్‌అలీ, ఏఎంవీఐలు స్వర్ణలత, సుమలత, వంశీ, ఉద్యోగులు పాల్గొన్నారు.


జాతీయ జెండాకు వందనం చేస్తున్న జిల్లా జడ్జి రాజగోపాల్, పక్కన న్యాయమూర్తులు

సాక్షి క్లాసిఫైడ్స్

Services

BUSINESS OFFER

■ మీ బంగారం మణప్పురం, ముత్తూట్, మర్వాడి షాప్ ఏ ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9177555694 స్పాట్ క్యాష్. [SCA25001311]

Wanted

■ త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీతం: 18K Ph: 9160900024, 9640400073 [SCA25001362]

■ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం : 20,000 నుండి 25,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418. [M-1256045]

సాక్షి క్లాసిఫైడ్స్

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి

వివరాలకు :

ఖమ్మం : 9705444182, 9010299957
కొత్తగూడెం : 9010223783
పాల్వంచ : 9705444183
భద్రాచలం : 9951602914
మణుగూరు : 9705944416
సత్తుపల్లి : 9652868642
మధిర : 9949927792

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.